సాక్షి అనంతపురం

మంగళవారం। 13। ఆగస్టు। 2024



చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19 వేలు పలికాయి.



డ్వామాకు ఐఎస్ఓ గుర్తింపు

జిల్లా డ్వామా కార్యాలయానికి ఐఎస్ఓ గుర్తింపు లభించింది. సోమవారం కలెక్టరేట్‌లో సర్టిఫికెట్‌ను కలెక్టర్ వినోద్ కుమార్ పీడీ వేణుగోపాల్‌రెడ్డికి అందజేశారు.

గరిష్టం/కనిష్టం

37.8°/23.1°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నాలుగు రోజులు వర్షసూచన

అనంతపురం అగ్రికల్చర్: ఉపరితల ద్రోణి కారణంగా రాగల నాలుగు రోజులూ జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. మంగళవారం నుంచి ఈనెల 16వ తేదీ వరకు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలో మోస్తరుగా వర్షసూచన ఉందన్నారు. ఒకట్రెండు ప్రాంతాల్లో భారీ వర్షం పడవచ్చని తెలిపారు. ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడే అవకాశం కూడా ఉందన్నారు.

రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చర్యలు తప్పవు

- ఎస్పీ కేవీ మురళీకృష్ణ



అనంతపురం క్రైం: సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు తప్పవని ఎస్పీ కేవీ మురళీకృష్ణ హెచ్చరించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఫేస్ బుక్, వాట్సాప్, ఎక్స్ (ట్విట్టర్), ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్, టెలిగ్రాంలలో పోస్టులు పెట్టేటప్పుడు విజ్ఞతతో వ్యవహరించాలని సూచించారు. వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతీసే విధంగా, పార్టీల మధ్య చిచ్చు పెట్టేలాంటి పోస్టులకు దూరంగా ఉండాలన్నారు. అలాంటి వారిని ప్రోత్సహించే వారిపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. సోషల్ మీడియా అకౌంట్లు, పోస్టులను పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీఐ ఆధ్వర్యంలోని బృందం 24 గంటలూ పర్యవేక్షిస్తుందన్నారు.

కరెంట్ కోతలను నిరసిస్తూ రైతుల ధర్నా



సబ్ స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న రైతులు

బ్రహ్మసముద్రం: కరెంట్ కోతలను నిరసిస్తూ సోమవారం రైతులు మండలంలోని వేపులపర్తి విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొలాలకు అందించే త్రీఫేస్ కరెంట్‌ను కోతలతోనే సరిపెడుతున్నారన్నారు. దీంతో పంటలకు నీరు అందక ఎండుముఖం పట్టాయని వాపోయారు. విద్యుత్ అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. దీంతో తమ బాధలను ఎవరికి చెప్పుకోలేక తెలియక విద్యుత్ కేంద్రం ముందు ధర్నాకు దిగామన్నారు. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని కోరారు.

పశుపతినాథుడి ఆలయంలో నంది విగ్రహాల ధ్వంసం



ధ్వంసమైన నంది విగ్రహాలు

రాయదుర్గం: మండలంలోని చదం గ్రామ సమీపాన లింగాలబండపై కొలువుదీరిన చతుర్ముఖ పశుపతినాథుడి ఆలయంలో రెండు నంది విగ్రహాలను దుండగులు ధ్వంసం చేశారు. మూలవిరాట్ చుట్టూ క్షుద్రపూజలు నిర్వహించారు. సోమవారం వెలుగు చూసిన ఈ ఘటన కలకలం రేపింది. లింగాలబండపై వెలసిన పశుపతి నాథుడి ఆలయం ఎంతో ప్రసిద్ధి పొందింది. నేపాల్ దేశంలో మాదిరిగా మూలవిరాట్టుకు నాలుగు వైపులా నందీశులు కొలువుదీరి ఉండడం గమనార్హం. మన దేశంలో మరెక్కడా ఇలా లేదు. దీంతో ఆలయం ఎంతో పేరు ప్రఖ్యాతులు పొందింది. ఇప్పటికే ఆలయంలో గుప్త నిధుల వేటగాళ్లు పలుమార్లు తవ్వకాలు జరిపారు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి ఆలయానికి ఉన్న ఇనుప తలుపు పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. మూలవిరాట్ చుట్టూ క్షుద్రపూజలు నిర్వహించారు. రెండు నంది విగ్రహాలు పగలగొట్టారు. సోమవారం వేకువ జామున పూజలు చేసేందుకు ఆలయానికి వెళ్లిన అర్చకులు ఈ విషయాన్ని గుర్తించి స్థానికులకు సమాచారం అందించారు. సీఐ శ్రీనివాసులు ఘటనాస్థలిని పరిశీలించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆలయాన్ని పరిశీలించి, స్థానికులతో మాట్లాడారు. విషయాన్ని దేవదాయశాఖ మంత్రితో పాటు ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కాగా, ఆలయంలో నంది విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి డిమాండ్ చేశారు.



నా పేరు ఎన్ శంకరయ్య. పామిడి మండలం దేవరపల్లి గ్రామం. నా వయస్సు 70 ఏళ్లు. చూపు లేదు. గత ప్రభుత్వ హయాంలో ఇంటికే వచ్చి రేషన్ సరుకులిచ్చేవారు. ప్రస్తుత కూటమి పాలనలో సీఎం చంద్రబాబు ఇంటింటికీ రేషన్ పంపిణీ రద్దు చేశారు. దీంతో నాలాంటి వారికి కష్టాలు మొదలయ్యాయి. మహిళలు, వృద్ధులు రేషన్ షాపునకు వెళ్లి సరుకులు తెచ్చుకోవడం చాలా కష్టంగా ఉంటుంది. పేదలపై కక్ష కట్టి ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం దుర్మార్గం.

పేదలపై పగ..
ఇంటింటికీ రేషన్‌కు పొగ



ఉరవకొండలోని 6వ రేషన్‌షాపు వద్ద వేచి ఉన్న కార్డుదారులు

- సర్కారు 'చౌక'బారు నిర్ణయం
- ఇంటింటికీ రేషన్‌కు మంగళం
- నిలిచిపోనున్న 405 ఎండీయూ వాహనాలు
- ఉపాధి కోల్పోనున్న నిర్వాహకులు
- లబ్ధిదారులకు తప్పని కష్టాలు
- పలుచోట్ల చౌక దుకాణాల వద్ద మొదలైన పడిగాపులు

అనంతపురం అర్బన్/ఉరవకొండ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. హామీల అమలు అటుంచితే.. ప్రజలకు వాతలు, సంక్షేమ పథకాలకు కోతలు మొదలయ్యాయి. తాజాగా ఇంటింటికీ రేషన్ పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వం మంగళం పాడింది. ఈ కార్యక్రమాన్ని నిలిపివేస్తున్నట్లు ఇటీవల నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో చంద్రబాబు ప్రకటించారు. ఇప్పటివరకూ ఇంటి వద్దనే రేషన్ అందుకుంటున్న లబ్ధిదారులు ఇక నుంచి చౌక ధరల దుకాణాలకు వెళ్లి బియ్యం, నిత్యావసర వస్తువులు తెచ్చుకోవాల్సిన దుస్థితి రానుంది. రేషన్ కోసం మళ్లీ పడిగాపులు తప్పవంటూ లబ్ధిదారులు వాపోతున్నారు. ఇంటింటికీ రేషన్ విధానం రద్దు చేయడంతో ఉపాధి కోల్పోతామని ఎండీయూ వాహన నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.

రేషన్ సరుకుల్లోనూ కోత..

చంద్రబాబు ప్రభుత్వం వచ్చీ రాగానే రేషన్ సరుకుల్లో కోత విధించింది. కందిపప్పు, పంచదార పంపిణీకి మంగళం పాడేసింది. జూన్, జూలై మాసాల్లో కందిపప్పు, పంచ దార సరఫరా నిలిపివేయడంతో పాటు ఆగస్టు నెల కూడా ఇవ్వలేదు. ఒక్కో కార్డుదారునికి అర కిలో చక్కెర రూ. 17కు, కిలో కంది పప్పు రూ.67కు అందించేవారు. పేదలకు ఎంతో ఉపయోగపడే ఇలాంటి సరుకుల పంపిణీ నిలిపివేశారు.

ఉపాధికి గండి..

ఇంటింటికీ రేషన్ విధానం రద్దు చేస్తుండడంతో జిల్లావ్యాప్తంగా 405 ఎండీయూ వాహనాల నిర్వాహకులు ఉపాధి కోల్పోనున్నారు. అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 173 ఎండీయూ వాహన నిర్వాహకులు, గుంతకల్లు డివిజన్‌లో 109, కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో 123 ఎండీయూ వాహన నిర్వాహకులకు ప్రభుత్వ నిర్ణయం శరాఘాతంగా మారింది. ప్రత్యామ్నాయ ఉపాధి చూపకుండా రద్దు చేయడంతో తాము, తమ కుటుంబాలు వీధిన పడతాయని ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో...

చౌక ధరల దుకాణాలు	1,645
బియ్యం కార్డులు	6,67,268
ఎండీయూ వాహనాలు	405

డివిజన్ వారీగా చౌక దుకాణాలు, ఎండీయూ వాహనాలు

డివిజన్	చౌక దుకాణాలు	ఎండీయూ వాహనాలు
అనంతపురం	693	173
గుంతకల్లు	448	109
కళ్యాణదుర్గం	504	123
మొత్తం	1,645	405

మహిళలు, వృద్ధులకు చాలా ఇబ్బంది



పాత కష్టాలు తలిస్తేనే భయమేస్తోంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు రేషన్ కోసం స్టోర్లకు వెళ్లి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. సరుకులు భుజాన మోస్తూ రావాల్సిన పరిస్థితి. కొత్త ప్రభుత్వం వచ్చి కనీసం మూడు నెలలు కాక ముందే పథకాన్ని నిలిపివేయడం దారుణం. అందరి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఎండీయూ వాహనం ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీ చేయాలి.

– మీనాక్షి, సొల్లాపురం, కణేకల్లు మండలం

ఆటో బాడుగకు తీసుకుని వెళ్లాలి



గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే వచ్చి బియ్యం, చక్కెర, బ్యాళ్లు అందించేవారు. ఇప్పుడు స్టోరుకు వెళ్లినా కేవలం బియ్యం మాత్రమే అందుతున్నాయి. సరుకుల కోసం ప్రస్తుతం అర కిలోమీటరు దూరంలో ఉన్న రేషన్ షాపునకు వెళ్లాల్సి వస్తోంది. ఇందుకు రూ.80తో ఆటో బాడుగకు తీసుకుని వెళ్లాలి. పేదల పట్ల కూటమి ప్రభుత్వం కక్ష కడుతోంది.

– శ్రీనివాసులు, కార్డుదారుడు, ఉరవకొండ



ఇబ్బందుల్లోకి నెడతారా?



బండి ఇంటి వద్దకే వచ్చి బియ్యం, సరుకులు ఇవ్వడం బాగుండేది. మాకు స్టోరు దూరంగా ఉంటుంది. అక్కడికి వెళ్లి తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా ఉంటుంది. మేం వెళ్లినప్పుడు స్టోరు మూసి ఉంటే తెరిచే వరకు అక్కడే పడిగాపులు కాయాలి. మంచి పనులకు మంగళం పాడుతూ ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టేయడం సరికాదు.

– లక్ష్మిదేవి, అనంతసాగర్ కాలనీ, బీకేఎస్ మండలం

ఉపాధి కోల్పోతాం



ఇంటింటికీ రేషన్ అందిస్తున్నందుకు ప్రభుత్వం మాకు రూ.21 వేలు ఇస్తోంది. ఈ విధానం రద్దు చేయడం ద్వారా మేం ఉపాధి కోల్పోతాం. రద్దు చేసేటప్పుడు మా గురించి కూడా ప్రభుత్వం ఆలోచించాలి. ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో మా కుటుంబాలు వీధిన పడతాయి. – రామాంజినేయులు, ఎండీయూ నిర్వాహకుడు

ఎంతో సౌలభ్యంగా ఉండేది



గతంలో స్టోర్ల చుట్టూ తిరిగి రేషన్ కోసం క్యూలో నిల్చోవాల్సి వచ్చేది. అలాంటి ఇబ్బందులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తొలగిస్తూ ఇంటి వద్దకే రేషన్ బియ్యం అందించే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రేషన్ ఇస్తున్నట్లు ముందస్తుగానే సమాచారం అందేది. ఇంటికి సమీపంలోనే ఉండి సరుకులు తీసుకెళ్లేవాళ్లం. ఎంతో సౌలభ్యంగా ఉన్న కార్యక్రమాన్ని కొత్త ప్రభుత్వం తొలగించడం తగదు. రేషన్ విషయంలో కొత్త సమస్యలు సృష్టించవద్దు. – ప్రేమకళ, అనంతపురం

సమస్యలు పరిష్కరించకుండా ఏం చేస్తున్నారు?

- అధికారుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం
- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో 410 వినతులు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'చాలా సమస్యలు మండల, డివిజన్ స్థాయిలో పరిష్కరించాల్సినవే ఉంటున్నాయి. అయినా, వాటి పరిష్కారం కోసం ప్రజలు కలెక్టరేట్‌కు వస్తున్నారంటే అక్కడ ఉండి మీరేమి చేస్తున్నట్టు' అంటూ కలెక్టర్ వి.వినోద్‌కుమార్ మండల, డివిజన్ స్థాయి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టర్ శిరీష, డీఆర్‌డీఏ పీడీ ఓబులమ్మ, వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై 410 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు క్షేత్రస్థాయిలోనే పరిష్కారం కావాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

- అమూల్ పాల సేకరణ కార్యక్రమాన్ని పునరుద్ధరించి పాడి రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున, రైతులు మాధవి, నాగరాజు విన్నవించారు. గ్రామాల్లో పాల సేకరణ నిలిపివేయడంతో పాల సొసైటీ సభ్యులు, పాడి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎరగాలి

అనంతపురం అర్బన్: జిల్లాలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలతో పాటు ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరవేయాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'హర్ ఘర్ తిరంగా'లో భాగంగా జాతీయ జెండాతో సెల్ఫీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకంతో కలెక్టర్, అధికారులు ఫొటోలు దిగారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, పర్యాటక శాఖ అధికారి జయకుమార్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకకు పకడ్బందీ ఏర్పాట్లు

స్వాతంత్ర్య దిన వేడుకకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సోమవారం పోలీసు పరేడ్ మైదానంలో ఎస్పీ మురళీకృష్ణతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేయాలని ఆదేశించారు. చిన్నపాటి పొరపాటుకూ తావ్వికూడదని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఆర్‌డీఓ వసంతబాబు, డీటీసీ వీర్రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మళ్లీ నిండేనా.. ఆశలు పండేనా?

- నిరాశ మిగిల్చిన తుంగభద్రమ్మ
- వారం రోజుల్లో కొత్త గేటు ఏర్పాటు చేస్తామంటున్న అధికారులు
- వరుణుడు కరుణించాలని రైతుల వేడుకోలు



టీబీ డ్యాం 19వ క్రస్ట్ గేటు వద్ద పరిశీలిస్తున్న అధికారులు, నిపుణులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం/అనంతపురం సెంట్రల్: వర్షాభావంతో అల్లాడుతున్న సమయంలో ఆశల దీపంలా కనిపించిన తుంగభద్ర జలాశయం గేట్ కొట్టుకోవడం జిల్లా రైతన్నలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. శనివారం రాత్రి ఆకస్మాత్తుగా డ్యాం 19వ క్రస్ట్ గేటు గల్లంతవడంతో భారీగా నీరు వృథాగా వెళ్లిపోతోంది. జిల్లాలో ఆయకట్టు రైతులకు హెచ్చెల్సీనే ప్రధాన ఆధారం. దీని కింద దాదాపు 1.80 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నప్పటికీ ప్రతి సంవత్సరం లక్ష ఎకరాలకు పైగా సాగునీరు అందిస్తున్నారు. గత ఏడాది వర్షాభావంతో మిడ్‌పెన్నార్ దిగువన ఉన్న ఆయకట్టు రైతులు తమ పొలాలను బీళ్లుగా పెట్టుకున్నారు. ఈ ఏడాది టీబీ డ్యాం పూర్తిగా నిండడంతో సకాలంలో నీటిని విడుదల చేస్తారని ఎంతో ఆశతో ఎదురుచూశారు. ఎగువన ఉన్న హెచ్ఎల్ఎంసీ, జీబీసీ కింద మిర్చి, వరి, ఇతర పంటల సాగుకు నార్లు పోసుకుంటున్నారు. ఇలాంటి సమయంలో దురదృష్టవశాత్తు జలాశయం చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా క్రస్ట్ గేటు కొట్టుకుపోయి అన్నదాతలకు ఆవేదన మిగిల్చింది.

వరుణుడు కరుణించాలి..

ప్రస్తుతం టీబీ డ్యాంలోకి 25,571 క్యూసెక్కులు మాత్రమే ఇన్‌ఫ్లో వస్తోంది. కర్ణాటక రాష్ట్రంలో వర్షాలు కూడా తగ్గుముఖం పట్టాయి. ఈ సమయంలో జలాశయం ఖాళీ అయితే మళ్లీ నిండుతుందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వరుణుడు కరుణించి డ్యాం మళ్లీ నిండాలని ఆయకట్టు రైతులు దేవుడిని వేడుకుంటున్నారు.

వారంలో కొత్త గేటు..

టీబీ జలాశయం గేటు కొట్టుకుపోవడం కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఇంజినీరింగ్ అధికారులకు కూడా విస్మయం కలిగించింది. రెండు రోజులుగా ఇరురాష్ట్రాల అధికారులు జలాశయం వద్దే మకాం వేశారు. వారంలోపు ఎలాగైనా నూతన గేటును ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు. డ్యాం కింద ఇప్పటికే భారీ గేటును తయారు చేయడంలో నిపుణులు, కార్మికులు నిమగ్నమయ్యారు.

నేడు డ్యాంను పరిశీలించనున్న మంత్రులు

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయాన్ని మంగళవారం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పరిశీలించనున్నారు. అధికారులతో సమావేశం కానున్నారు. వీలైనంత త్వరగా గేటు ఏర్పాటు చేసేలా అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు.

జిల్లాలో తుంగభద్ర ఆయకట్టు ఇలా..

ఉప కాలువ పేరు	ఆయకట్టు (ఎకరాల్లో)
హైలెవల్ మెయిన్ కెనాల్ (హెచ్ఎల్ఎంసీ)	35,541
ఎంపీ సౌత్ కెనాల్	33,176
ఎంపీ నార్త్ కెనాల్	13,325
తాడిపత్రి బ్రాంచ్ కెనాల్	31,131
గుంతకల్లు బ్రాంచ్ కెనాల్	32,063

పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం

జలాశయం గేటును యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించేందుకు ఇరు రాష్ట్రాల అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం లక్ష క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతున్నారు. జలాశయంలో నీటిమట్టం తగ్గితే హెచ్చెల్సీకి కూడా తగ్గే అవకాశముంది. అయితే, ఇంకా వర్షాలు కురిసే అవకాశం ఉంది కాబట్టి జలాశయం మళ్లీ నిండే అవకాశాలున్నాయి.

– ఎస్. రాజశేఖర్, హెచ్చెల్సీ ఎస్ఈ

క్లుప్తంగా

జీజీహెచ్‌లో వృద్ధురాలి మృతదేహం



అనంతపురం క్రైం: జిల్లా సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ గుర్తు తెలియని వృద్ధురాలు (72) మృతి చెందింది. ఈ మేరకు అనంతపురం రెండో పట్టణ పోలీసులు సోమవారం తెలిపారు. వృద్ధురాలిని ఆస్పత్రిలో చేర్పిన సమయంలో ఆలూరు, గుంతకల్లు రోడ్డు అన్న చిరునామాను పేర్కొన్నారు. కాగా, మృతురాలు ఏ ప్రాంతానికి చెందినవారన్నది తెలియరాలేదు. సంబంధీకులు ఎవరైనా ఉంటే అనంతపురం టూటౌన్ పోలీసులు లేదా, ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులను సంప్రదించాలని సూచించారు.

19న బొలికొండ రంగనాథుడి కల్యాణోత్సవం

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామంలో ఈ నెల 19న బొలికొండ రంగనాథస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ నాగేంద్రుడు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా ప్రతి ఏటా కల్యాణోత్సవాన్ని ఆనవాయితీగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ నెల 19న సోమవారం ఉదయం 11 గంటలకు కల్యాణోత్సవం జరిపించనున్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం రూరల్: డీఎస్సీ ఉచిత శిక్షణకు అర్హులైన ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రామాంజనేయులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులను అందజేయాలన్నారు. మూడు నెలల పాటు శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తామన్నారు. పూర్తి వివరాలకు జిల్లా గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ట్రాక్‌మెన్ ఆత్మహత్య



శివలింగప్ప (ఫైల్)

గుంతకల్లు: జీవితంపై విరక్తితో ఓ ట్రాక్‌మెన్ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పాత గుంతకల్లుకు చెందిన శివలింగప్ప(57) గుంతకల్లు–బళ్లారి సెక్షన్‌లో ట్రాక్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మంత్రాలయం సమీపంలో ఉన్న రైల్వే సామగ్రిని తీసుకువచ్చేందుకు శివ ఐచర్ వాహనంలో వెళ్లిన ఆయన లోడింగ్ తర్వాత తాను అలసిపోయానని, వాహనంలో వెనుక సేదతీరుతానంటూ డ్రైవర్‌తో చెప్పి ఎక్కాడు. మార్గం మధ్యలో సామగ్రి తడవకుండా కప్పిన టార్పాలిన్ తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వాహనం ఆదోని సమీపంలో ప్రయాణిస్తుండగా వెనుకనే వస్తున్న మరో వాహనదారులు గమనించి డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. వెంటనే ఐచర్‌ను ఆపి చూసిన డ్రైవర్ ఒక్కసారి ఆందోళనకు గురై, వెంటనే గుంతకల్లు రైల్వే ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే శివలింగప్ప మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, శివ మృతికి కారాణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆలీ బాబా... మేవాత్ దొంగలు

- ఏటీఎంలే లక్ష్యంగా మేవాత్ ముఠా దోపిడీలు
- అనంత జిల్లాలోని పలు ఏటీఎంల్లో చోరీలు
- బెంగళూరులోని విమానాశ్రయానికి వెళుతూ పట్టుబడిన నిందితులు
- డబ్బు తీసుకుని నిందితులను జిల్లా పోలీసులకు అప్పగించిన కర్ణాటక ఖాకీలు
- నిందితులు హరియాణలోని మేవాత్ వాసులుగా గుర్తింపు

అనంతపురం క్రైం: 'ఆలీ బాబా నలభై దొంగల' కథ మనం విన్నదే. అచ్చం అదే తరహాలో అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులు తయారయ్యారు. దర్జాగా విమానాల్లో వచ్చి... దోపిడీలు, లూటీలు సాగించి వెను వెంటనే సమీపంలోని విమానాశ్రయాల ద్వారా ఎంచక్కా తమ ప్రాంతానికి ఉడాయించేస్తున్నారు. ఈ క్రమంలో హరియాణాలోని మేవాత్ ముఠా ఒకటి గత కొన్ని రోజులుగా జిల్లా పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేసింది.

ఏం జరిగింది?

జూన్ 8న కూడేరులోని ఏటీఎం కేంద్రంలో దొంగలు పడ్డారు. ఈ నెల 1వ తేదీ రాత్రి గార్లదిన్నెలోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలోకి దుండగులు చొరబడి గ్యాస్ కట్టర్ సాయంతో యంత్రాన్ని ధ్వంసం చేసి రూ.లక్షలు అపహరించుకెళ్లారు. అనంతరం అనంతపురంలోని రామ్‌నగర్‌లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో చొరబడి రూ.24 లక్షలు అపహరించుకెళ్లారు. ఆ మరుసటి రోజు చిత్తూరు జిల్లాలో ఓ ఏటీఎంని దోచుకున్నారు. ఒకే తరహాలో ఏటీఎం కేంద్రాల్లోని నగదును అపహరించుకెళ్లిన అంశాన్ని సవాల్‌గా తీసుకున్న జిల్లా పోలీసులు... కేసు దర్యాప్తులో ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

పట్టుబడ్డారు ఇలా...

ఏటీఎం కేంద్రాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా నిందితుల జాడను పసిగట్టిన పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. వారు వినియోగించిన వాహనాలను గుర్తించారు. చిత్తూరు జిల్లాలో ఏటీఎం చోరీ అనంతరం క్రెటా వాహనం టోల్ గేటు వద్ద క్రాస్ చేసిన దృశ్యాలను గమనించిన పోలీసులు అందులో అనంతపురంలోని ఏటీఎం సెంటర్ వద్ద రెక్కీ నిర్వహించిన ఇద్దరు ఉన్నట్లుగా గుర్తించారు. టోల్ ట్యాక్స్ కట్టిన సెల్‌ఫోన్ నంబరు ఆధారంగా నిందితులు కర్ణాటక వైపుగా వెళుతున్నట్లు నిర్ధారించుకుని ఆ రాష్ట్ర పోలీసులను అప్రమత్తం చేశారు. ఈ క్రమంలో పోలీసులను ఏమారుస్తూ బాగల్‌కోట జిల్లా లోకి ప్రవేశించిన నిందుతులు హోలగొంద వద్ద కర్ణాటక పోలీసులకు పట్టుబడ్డారు.

మొరాయించిన కర్ణాటక ఖాకీలు

నిందితులను అదుపులోకి తీసుకున్న అంశాన్ని కర్ణాటక పోలీసులు అత్యంత గోప్యంగా ఉంచారు. ఆలస్యంగా విషయం తెలుసుకున్న జిల్లా పోలీసులు అక్కడకు చేరుకుని నిందితులను తమకు అప్పగించాలంటూ శతవిధాలా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కర్ణాటక పోలీసుల నుంచి సహకారం లేకపోవడంతో చివరకు ఐజీతో సహా ఎస్పీ కేవీ మురళీకృష్ణ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. దీంతో ఇద్దరు నిందితులను అనంత పోలీసులకు కర్ణాటక పోలీసులు అప్పగించారు. అయితే నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న రూ.30 లక్షలకు పైగా నగదును వారే ఉంచుకున్నట్లు సమాచారం. దీంతో నిందితులిద్దరినీ జిల్లా కేంద్రానికి తరలించి పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టారు. దీంతో ఆసక్తికరమైన విషయాలు ఎన్నో వెలుగు చూశాయి. నిత్యం చోరీలే లక్ష్యంగా పని చేసే ఈ మేవాత్ ముఠా తాజాగా పలు చోరీ కేసుల్లో సొత్తు రికవరీ కోసం వెళ్లిన ఢిల్లీ పోలీసులపైనే కాల్పులు జరిపినట్లుగా సమాచారం.



జిల్లా పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

చోరీలు చేస్తారిలా...

- మేవాత్ ప్రాంతానికి చెందిన ఎనిమిది మంది ముఠాగా ఏర్పడి కొంత కాలంగా రాయలసీమ జిల్లాల్లో పాగా వేశారు.
- స్థానికంగా పంజాబీ ధాబాల వద్ద తల దాచుకుంటూ ఏటీఎం కేంద్రాల వద్ద తొలుత రెక్కీ నిర్వహిస్తారు.
- తాము రెక్కీ నిర్వహించిన అనంతరం విషయాన్ని ఢిల్లీలోని ముఠా నాయకులకు చేరవేస్తారు. వెను వెంటనే ఏటీఎంలను గ్యాస్ కట్టర్ సాయంతో తెరిచే నిష్ణాతులైన వారు ఢిల్లీ నుంచి విమానంలో సమీపంలోని విమానాశ్రయానికి చేరుకుంటారు.
- వీరిని ఢిల్లీ నుంచి తెచ్చుకుని అందుబాటులో ఉంచుకున్న క్రెటా వాహనం ద్వారా సంబంధిత ఏటీఎం కేంద్రానికి చేరవేస్తారు.
- అనంతరం అందరూ కలసి గ్యాస్ కట్టర్ సాయంతో ఏటీఎంను తెరిచి అందులోని నగదు అపహరిస్తారు.
- వెనువెంటనే సమీపంలోని విమానాశ్రయాల ద్వారా ఢిల్లీకి చేరుకుంటారు.
- స్థానికంగా ఇద్దరు మాత్రం రెక్కీ నిర్వహిస్తూ వస్తుంటారు.
- వరుసగా ఏటీఎం సెంటర్లలో చోరీలు జరిగిన తీరును పరిశీలిస్తే ఎనిమిది మంది ముఠాగా ఏర్పడి ఈ చోరీలకు తెగబడినట్లు తెలుస్తోంది.
- ఇందు కోసం ప్రత్యేకంగా ఢిల్లీ నుంచి తెప్పించుకున్న క్రెటా వాహనాన్ని అందుబాటులో ఉంచుకున్నట్లుగా పోలీసులు గుర్తించారు.

టీచర్ల సర్దుబాటును ఆపాలి

- ఫ్యాప్టో నాయకుల డిమాండ్



అనంతపురం ఎంఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: అశాస్త్రీయ విధానాలతో చేపట్టిన టీచర్ల సర్దుబాటు ప్రక్రియను తక్షణమే ఆపాలంటూ ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన టీచర్ల సర్దుబాటు ప్రక్రియను బహిష్కరించి, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ నిరసనలు తెలిపారు. అనంతపురం రూరల్ మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎస్. సిరాజుద్దీన్, సెక్రటరీ జనరల్ లింగమూర్తి మాట్లాడారు. టీచర్ల సర్దుబాటు ప్రక్రియ చాలా అశాస్త్రీయంగా ఉందన్నారు. ఉపాధ్యాయ సంఘాలు సూచించిన ఏ ఒక్క అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఒకే పాఠశాల నుంచి ఎస్జీటీలను తొలగించి మళ్లీ అదే పాఠశాలకు అదే కేడర్ ఉపాధ్యాయులను నియమించాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. ఎస్జీటీలకు ప్రమోషన్లు కల్పించి ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు అవసరమైన పాఠశాల సహాయకులను నియమిస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. ఇప్పటికైనా తప్పిదాలు పునరావృతం కాకుండా ప్రాథమిక పాఠశాలలను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేస్తూ ప్రాథమిక విద్యను అతలాకుతలం చేస్తున్న జీఓ 117ను రద్దు చేసే వరకూ పని సర్దుబాటు ప్రక్రియ చేపట్టకూడదన్నారు. అనంతరం ఎంఈఓ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. జిల్లా ఫ్యాప్టో కో చైర్మన్లు లింగమయ్య, రమణారెడ్డి, పెద్దన్న, నాయకులు మహమ్మద్ రఫీ, నాయకులు ఓబులేసు, భాగ్యరాజ్, సాయప్ప, లక్ష్మీనారాయణ, ఎం. శ్రీనివాసులు, ఆదిశేషు, సురేష్ కుమార్, ఫణి భూషణ్ పాల్గొన్నారు.

'అసంబద్ధ సర్దుబాట్ల ప్రక్రియ వెంటనే ఆపాలి'

రాష్ట్ర ప్రభుత్వం అసంబద్ధంగా చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను వెంటనే ఆపేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం చేస్తున్న ఉపాధ్యాయ సర్దుబాట్లకు శాస్త్రీయత లేదన్నారు. సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయ విద్యా వ్యవస్థను గందరగోళానికి నెట్టేయడం దారుణమన్నారు. 15 వేలమంది ఉపాధ్యాయులను మిగులుగా తేల్చడం అంటే విద్యా వ్యవస్థలో ఉన్న డొల్లతనం బయటపడిందన్నారు. నియంతృత్వ పోకడలు కొనసాగిస్తే ప్రభుత్వ విద్యా వ్యవస్థ తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందన్నారు. ఇలాంటి స్థితిలో విద్యావ్యవస్థను కాపాడుకునేందుకు ఉపాధ్యాయులంతా ఏకమై పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

ఎస్సీ, ఎస్టీలకు రక్షణ కల్పించాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: భౌతిక, సామాజిక, ఆర్థిక దౌర్జనాలకు గురైన ఎస్సీ, ఎస్టీ వర్గాలకు న్యాయపరమైన రక్షణ కల్పించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. నేర తీవ్రతను బట్టి బాధితులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ జాతుల (అత్యాచార నిరోధక) చట్టం 1989 పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించి, మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలపై దౌర్జనాలకు పాల్పడిన వారిని అరెస్టు చేయాలన్నారు. అత్యాచార బాధితులైన ఎస్సీ, ఎస్టీలకు నేర తీవ్రతను బట్టి రూ.25 వేల నుంచి రూ.85 వేల వరకు పరిహారం చెల్లించాలన్నారు. కేసుల విచారణ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఓబుళమ్మ, బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారి, డీటీడబ్ల్యూఓ రామాంజినేయులు పాల్గొన్నారు.

ఉద్యమంలా నులి పురుగుల నిర్మూలన

ఈ నెల 20వ తేదీ నుంచి వారం రోజుల పాటు నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని జిల్లాలో ఉద్యమంలా నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వైద్యారోగ్యశాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమ పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భూసేకరణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

'జాతీయ రహదారులు, పవర్‌గ్రిడ్, రైల్వే తదితర ప్రాజెక్టుల నిర్మాణంలో కీలకమైన భూసేకరణ ప్రక్రియను ప్రత్యేక శ్రద్ధతో చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. ప్రాజెక్టులకు భూ సేకరణ అంశంపై సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డితో కలసి రెవెన్యూ, జాతీయ రహదారులు, విద్యుత్, తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. భూసేకరణ విషయంలో కోర్టు కేసులు ఉంటే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఆర్డీఓలు వసంతబాబు, రాణిసుస్మిత, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ శ్రీధర్, ఎన్‌హెచ్ డీఈఈ రామచంద్రారెడ్డి, టెక్నికల్ మేనేజర్ మురళీ, ఏటీఎమ్ సాయికృష్ణ, కలెక్టరేట్ పరిపాలనాధికారి మారుతి, భూ పరిపాలన విభాగం సూపరింటెండెంట్ రియాజుద్దీన్, తహసీల్దార్లు బాలాజీ, పుణ్యవతి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

రెండు నెలలుగా వేతనం లేదు

రెండు నెలలుగా తమకు వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఏపీ ఏపీ ఫైబర్ నెట్ లిమిటెడ్ (ఏపీఎస్‌ఎఫ్ఎల్) క్షేత్రస్థాయి ఉద్యోగులు, వాహన నిర్వాహకులు విన్నవించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫైబర్ నెట్ ఉద్యోగులు అశోక్, రామకుమార్, రమణ, తిప్పేస్వామి, అనంద్, వాహన నిర్వాహకులు వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పని చేస్తున్న 40 మందికి రెండు నెలలుగా వేతనాలు అందలేదన్నారు. దీంతో కుటుంబపోషణ భారంగా మారిందన్నారు. అలాగే గ్రామాల్లో ఫైబర్ పనుల నిమిత్తం సామగ్రి, మనుషులను తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేసిన వాహనాలకు సంబంధించి ఐదు నెలల అద్దె బకాయి పేరుకుపోయిందన్నారు. తమ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని అభ్యర్థించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే సంబంధిత అధికారిని పిలిపించి, మాట్లాడారు.

మహిళా దొంగల చేతివాటం

- ప్రయాణికురాలి బంగారు నగల అపహరణ
- వాటాల పంపకంలో ఘర్షణ

బత్తలపల్లి: బస్సులో ప్రయాణికురాలి నుంచి బంగారు నగలు అపహరించుకెళ్లిన ముగ్గురు మహిళలు వాటాలు పంచుకోవడంలో తేడా రావడంతో ఘర్షణ పడ్డారు. విషయం తెలుసుకున్న బాధితురాలు వెంటనే సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వివరాలు... పుట్లూరు మండలం మడుగుపల్లికి చెందిన కోరే మోహనయ్య భార్య రాధమ్మ ఆదివారం బత్తలపల్లి మండలం యర్రాయపల్లిలోని బంధువుల ఇంటికి వచ్చింది. సోమవారం ధర్మవరానికి వెళ్లి చీరలు కొనుగోలు చేసిన అనంతరం తన మెడలోని 8 తులాల బంగారాన్ని తీసి బ్యాగులో ఉంచుకుని స్వగ్రామానికి బస్సులో బయలుదేరింది. అదే బస్సులో ముగ్గురు మహిళలు ఆమెను అనుసరిస్తూ చేతి బ్యాగులో ఉన్న బంగారాన్ని వెంకటగారిపల్లి బస్టాఫ్ వద్ద అపహరించి, మాల్యవంతం వద్ద బస్సు దిగారు. బస్సు కొంత దూరం వెళ్లగానే బాధితురాలు తన నగలు అపహరణకు గురైన విషయం తెలుసుకుని వెంటనే బస్సు దిగింది. అదే సమయంలో నార్పల వైపు నుంచి ద్విచక్రవాహనంలో వస్తున్న ఉపాధ్యాయుడిని ఆపి తన పరిస్థితి వివరించడంతో ఆయన ఆమెను ఎక్కించుకుని మాల్యవంతం బస్టాఫ్ వద్దకు చేరుకుని బస్సు దిగిన మహిళల గురించి ఆరా తీశారు. ఆటోలో వారు ముగ్గురూ బత్తలపల్లి వైపు వెళ్లినట్లు తెలుసుకుని బత్తలపల్లి వైపుగా ప్రయాణమయ్యారు. గ్రామ శివారులోకి చేరుకోగానే నర్సరీల వద్ద ముగ్గురు మహిళలు ఘర్షణ పడుతుండడం గమనించిన ఇద్దరూ వెంటనే సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి లాంగ్ చైను, కమ్మలు, రాళ్ల నెక్లెస్‌ను స్వాధీనం చేసుకుని బాధితురాలికి అందజేశారు. నిందితులపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.



పోలీసుల అదుపులో ఉన్న మహిళా దొంగలు

'ఫోర్జరీ'తో స్థలాలు కాజేస్తే ఊరుకోం



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ


అనంతపురం క్రైం: ఫోర్జరీ డాక్యుమెంట్లతో స్థలాలు కాజేస్తే చూస్తూ ఊరుకోబోమని ఎస్పీ కేవీ మురళీకృష్ణ హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై 115 వినతులు అందాయి. ఎస్పీ స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. అనంతరం విలేకరులతో ఎస్పీ మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అత్యధికంగా సైబర్ మోసాలు, భూకబ్జాలు, కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలపై వినతులు అందాయన్నారు. సమస్యలను సకాలంలో పరిష్కరించేలా చొరవ తీసుకుని ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సరైన నిర్వచనం చెప్పేందుకు గట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు. భూకబ్జాలతో పాటు నకిలీ పత్రాలు సృష్టించి భూములు ఆక్రమించుకోవాలని చూస్తే ఎంతటివారినైనా ఉపేక్షించబోమన్నారు. సైబర్ మోసాలకు గురికాకుండా ఎవరికి వారు వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శాంతియుతంగా ఆలోచించి మంచి నిర్ణయాలు తీసుకోవడం వల్ల కుటుంబంలో విభేదాలకు తావుండదన్నారు. ఈ విషయంగా ప్రతి ఒక్కరూ విజ్ఞతతో వ్యవహరించాలన్నారు.

పంద్రాగస్టు వేడుకలకు మహిమ



అనంతపురం కల్చరల్: న్యూఢిల్లీ వేదికగా జరిగే స్వాతంత్య్ర దినోత్సవంలో ప్రాతినిధ్యం వహించే అవకాశం అనంతకు చెందిన మహిమకు దక్కింది. ఈ మేరకు నెహ్రూ యువకేంద్ర అధికారులు మణికంఠ, శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఏపీ నుంచి ఐదు జిల్లాలకు చెందిన యువతను ఎంపిక చేయగా... ఇందులో అనంతపురంలోని విజయనగర లా కాలేజీ విద్యార్థిని మహిమ ఉన్నారు. ఎన్‌వైకే నిర్వహించే సామాజిక సేవా కార్యక్రమాలు వికసిత భారత్, యువ ఉత్సవ్, మై భారత్, యూత్ పార్లమెంటు వంటి వాటిలో మహిమ చురుకుగా పాల్గొంటున్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు అరుదైన అవకాశం



నిర్మల

అనంతపురం సెంట్రల్: నగరంలోని నేతాజీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న కార్యకర్త నిర్మలకు అరుదైన అవకాశం దక్కింది. న్యూఢిల్లీలో ఈ నెల 15న జరిగే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొననున్నారు. పోషణ్ అభియాన్ కార్యక్రమం అమలులో దేశంలోనే రాష్ట్రం మూడో స్థానంలో ఉంది. ఇందులో భాగంగా ప్రతి జిల్లా నుంచి ఉత్తమ కార్యకర్తలను ఎంపిక చేశారు. అనంతపురం నుంచి నిర్మలకు అవకాశం దక్కింది. ఢిల్లీ వేడుకలకు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకావాలని కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమెకు ఆహ్వానం అందినట్లు అధికారులు తెలిపారు.

చదువుతో పాటు నైతికత చాలా ముఖ్యం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్

ఆత్మకూరు: చదువుతో పాటు నైతిక విలువలూ పెంపొందించుకున్నప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందని విద్యార్థులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ సూచించారు. ఆత్మకూరులోని కేజీబీవీని సోమవారం ఆయన పరిశీలించారు. తరగతి గదులను, భోజన నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో సమావేశమై మాట్లాడారు. పెద్దలను గౌరవించడం, ఎక్కడ ఎలా ఉండాలన్న అంశంపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లను తెలుసుకుని జాగ్రత్తగా ఉండాలన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జీసీడీఓ వాణీదేవి, కేజీబీవీ ప్రిన్స్‌పాల్ లీమారోజ్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

బాలింతపై దాడి



చికిత్స పొందుతున్న శిల్ప

గుమ్మఘట్ట: పచ్చి బాలింత అనే కనికరం కూడా లేకుండా దాయాదులు దాడి చేసి గాయపరిచిన ఘటన గుమ్మఘట్ట మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.... కలుగోడుకు చెందిన గొల్ల రవితో అదే గ్రామానికి చెందిన సురేష్, ఆంజనేయ, నరసింహ, చదం సురేష్, చంద్రకు పాత కక్షలున్నాయి. వీరంతా దాయాదులే. ఈ క్రమంలో సోమవారం ఉదయం రవితో దాయాదులు గొడవ పడుతుండడంతో గమనించిన కుటుంబసభ్యులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో రవితో పాటు ఆయన చెల్లెలు శిల్ప, అత్త ఆదిలక్ష్మిపై దాడి చేశారు. ఘటనలో శిల్పకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా, మూడు నెలల బాలింత అనే కనికరం కూడా లేకుండా శిల్పపై దాడి చేస్తుండడాన్ని గమనించిన స్థానికులు అడ్డుకున్నారు. క్షతగాత్రులను రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.



క్లుప్తంగా

వీల్‌చైర్ వితరణ



దివ్యాంగుడు భవానీ శంకర్‌కు వీల్‌చైర్ అందజేసిన కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం అర్బన్: కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం సాయిట్రస్ట్ సమకూర్చిన మల్టీ పర్పస్ వీల్ చైర్‌ను దివ్యాంగుడు భవానీ శంకర్‌కు కలెక్టర్ వినోద్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. ట్రస్ట్ ప్రతినిధి సాయి కుమార్ మాట్లాడుతూ.. దివ్యాంగుని పరిస్థితిని గమనించి ట్రస్ట్ తరఫున రూ.28 వేలు విలువ చేసే మల్టీ పర్పస్ వీల్‌చైర్‌ను అందించామన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ రసూల్, ట్రస్ ఏఓ రాఘవేంద్ర, నారాయణ నాయక్, దివ్యాంగుడి తల్లిదండ్రులు కిన్నెర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పరామర్శ



షమీమ్ నిగర్ సిద్దిఖా భాను మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంత

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కెప్టెన్ షెక్షావలి తల్లి షమీమ్ నిగర్ సిద్దిఖా భాను అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సోమవారం షెక్షావలి కుటుంబాన్ని పరామర్శించారు. భాను మృతదేహానికి నివాళులర్పించారు. వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజీఘర్ రిజ్వాన్, కార్పొరేటర్ సైఫుల్లాబేగ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో అనంత కళాకారుల ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న అనంత కళాకారులు

అనంతపురం కల్చరల్: అనంత కళాకారులు మరోసారి జాతీయ స్థాయిలో రాణించి అనంత కీర్తిని చాటారు. వివరాలు.. రాయలసీమ రంగస్థల సంస్థ వారు శ్రీకృష్ణకళా దర్బార్ పేరుతో తిరుపతి పట్టణంలోని మహతీ అడిటోరియంలో మూడు రోజుల పాటూ జాతీయస్థాయి శాస్త్రీయ, జానపద నృత్య పోటీలను నిర్వహించారు. అనంత తరఫున పాల్గొన్న లహరి డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు హరి ప్రసాద్ శిష్యబృందం ఫోక్ విభాగంలో సీనియర్ గ్రూప్‌లో జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి, సోలో విభాగంలో ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు. జానపద కళను విస్తృతంగా ప్రచారం చేస్తున్న హరి మాస్టర్ కృషిని కొనియాడారు. దేశవ్యాప్తంగా 400 మంది కళాకారులు పోటీపడగా అనంత కళాకారులు ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. కళాకారులను జిల్లా అసోసియేషన్ తరఫున వన్నూరు మాస్టర్, లక్ష్మీకాంత్, వినోద్ అభినందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఆత్మకూరు: ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్ లక్ష్మీనాయక్‌ను మండల ప్రజా ప్రతినిధులు కోరారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ లక్ష్మీనాయక్‌ను మండల ప్రజా ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత సర్పంచులు లక్ష్మీనారాయణరెడ్డి, కాంతమ్మ, కృష్ణానాయక్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ చదువుకోవాలి



చిన్నారులతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ చదువుకోవాలి. చదువుకుంటే సమాజంలో విలువ ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య తెలిపారు. సోమవారం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మాయి చదువు–అవనికి వెలుగు, ఇల్లాలి చదువు–ఇంటికి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో డ్రాపౌట్ పిల్లలు, 6 సంవత్సరాలు పైబడిన వారిని గుర్తించి స్థానిక పాఠశాలలో చేర్పించారు. 15 సంవత్సరాలు నిండిన వారు చాలా కాలంగా డ్రాపౌట్ అయిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో 22 మందిని గుర్తించి పాఠశాలలో చేర్పించామని తెలియజేశారు. పాఠశాలల్లో చేరేలా ఉంటే తమ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో సంప్రదించాలని కోరారు.

ఆఖరి మజిలీకి గౌరవంగా..

- వైకుంఠ రథాల ద్వారా సేవలందిస్తున్న సాయిమందిరాలు
- అనాథ మృతదేహాలకు ఉచితంగా అంత్యక్రియలు

నా అనుకునే వారికి ఏదైనా జరిగితే తల్లడిల్లిపోతాం. అలాంటిది మృతి చెందితే ఆ బాధ చెప్పలేనిది. ఇంకా వారి అంతిమ సంస్కారాలు నిర్వహించే వైకుంఠధామం ఎక్కడో దూరాన ఉంటే తీసుకెళ్లేందుకు పడరాని పాటు పడుతుంటాం. అంత్యక్రియలను వ్యాపారంగా మార్చేసిన ప్రైవేటు వ్యవస్థకు దీటుగా పూర్తి సేవాభావంతో సాయిబాబా మందిరం ఇరవై ఆరేళ్ల కిందటే వైకుంఠ రథాలను అందుబాటులోకి తెచ్చింది. పాడె కట్టుకుని నలుగురు అతి ప్రయాసతో తీసుకెళ్లాల్సిన పరిస్థితిని ఆసాంతం మార్చేసి దుఃఖం నుంచి సాంత్వన కల్గించే భగవద్గీత శ్లోకాలు, ధైర్యం చెప్పే వైరాగ్యగీతాలు, భక్తిభావం ఉట్టిపడే ఆకారంతో వైకుంఠ రథాలు అమూల్యమైన సేవలందిస్తున్నాయి. అయితే దురదృష్టవశాత్తూ జరగరానిది జరిగినప్పుడు చాలా మంది సాయం కోసం ఎవరిని సంప్రదించాలో తెలియక ఇబ్బందులు పడుతుంటారు. తెలిసిన వారందరినీ అడుగుతూ నిరాశ పడకుండా తెలుసుకునేలా వైకుంఠ రథాల కథా కమీషు, అందుబాటులో ఉండే నంబర్లతో 'సాక్షి' ప్రత్యేక కథనం మీకోసం..

– అనంతపురం కల్చరల్:



పాతూరు చెరువుకట్టపై వెలసిన షిరిడీ సాయిబాబా మందిరం అధ్యక్షుడిగా ఆర్యవైశ్య ప్రముఖుడు పిన్ని నాగరత్నం ఉండే రోజుల్లో 1998లో ప్రయోగాత్మకంగా వైకుంఠ రథాన్ని ప్రారంభించారు. అప్పటికి మరెక్కడా ఆ సంప్రదాయం లేదు. అప్పుడు వారు వసూలు చేసిన రుసుము కేవలం రూ.116. ప్రస్తుతం రూ.1,500 రుసుము వసూలు చేస్తున్నారు. వైకుంఠ రథం అవసరమైనవారు 9441601117 నంబర్‌కు సంప్రదించాలి.

అనాథలైతే ఉచితం

నగరంలో రెండవ రథం వేమన టెలీఫోన్ భవన్ ఎదురుగా ఉన్న షిరిడీ సాయిబాబా మందిరం అధ్యక్షుడు వైకుంఠం జయచంద్ర చౌదరి వినూత్నంగా ఆలోచించి కేవలం మృతదేహం వెంట ఒకరిద్దరు మాత్రమే వెళ్తే మిగతావాళ్లు ఎలా వస్తారన్న ఆలోచనతో తొలిసారి 20 మందికి పైగా పట్టే వాహనాన్ని ఏర్పాటు చేసి 'కైలాస రథం' అని పేరు పెట్టారు. ఇది 2007లో ఆరంభమైంది. ఇందుకోసం 08554-224442, 08554-2244443 నంబర్లకు సంప్రదించాలి. డీజిల్ ఖర్చుల కోసం రూ.1000 తీసుకుంటారు. అనాథలైతే ఉచితంగా సేవలందిస్తారు.

సాయి వైకుంఠ రథం

ఇక 2021లో మూడవ రోడ్డులోని షిరిడీ సాయి సేవా సమితి వారు సాయి వైకుంఠ రథాన్ని ఏర్పాటు చేశారు. 9440757151, 8885375790 నంబర్లకు సంప్రదించాలని నిర్వాహకుడు రఘునాథ్ తెలిపారు.

దహనక్రియల కోసం..

హరిశ్చంద్ర ఘాట్ పేరుతో గుత్తి రోడ్డు శ్మశాన వాటిక నిర్మాణంలో కీలకంగా వ్యవహరించిన పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయం వారు 'మహాప్రస్థానం' పేరుతో దహన సంస్కారాల కోసం రథాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడ కిరోసిన్, కట్టెలు, గ్యాసు, ఇతరత్రా వాటి కోసం రూ.4,500 తీసుకుంటారు. అవసరమైన వారు 08554-239641 నంబర్‌లో సంప్రదించాలి.

సాయిట్రస్టు సేవలు ఉచితం

కరోనా మహమ్మారి విజృంభించిన వేళలో దాదాపు అన్ని ఆలయాల వైకుంఠ రథాలు తాత్కాలికంగా ఆగిపోయాయి. అటువంటి రోజుల్లో సాయిట్రస్టు వారు దాతల సహకారంతో 2020లో వైకుంఠ రథాన్ని ఏర్పాటు చేసి వందల మృతదేహాలకు అంత్యక్రియలు చేశారు. కేవలం రూ.500లు మాత్రమే రుసుము పెట్టినా, ఇచ్చుకోలేని స్థితి ఉంటే పూర్తిగా ఉచితంగా ఇచ్చే రథంగా దీనికి పేరుంది. సేవలు కావాల్సిన వారు 8712345520 నంబర్‌ను సంప్రదించాలి.

ముస్లింల కోసం ప్రత్యేకం

కేఎం సైఫుల్లా ఎంపీగా ఉన్నరోజుల్లో తానే స్వయంగా ముస్లింల కోసం సొంత ఖర్చుతో విగతజీవులను తీసుకెళ్లడానికి ఓ వ్యానును అందించాడు. అయితే గత ఏడాది నుండి అది మరమ్మత్తులతో మూలపడడంతో బైతుల్ మాల్ సంస్థ 2023లో మరో వాహనం ఏర్పాటు చేసింది. కేవలం రూ.300 మాత్రమే వసూలు చేసే దీనిని 8885248707 నంబర్‌లో సంప్రదించవచ్చు. అలాగే క్రైస్తవులకు కూడా అరవిందనగర్‌లోని చర్చిలో ఓ రథం ఉన్నా నేరుగా వారినే సంప్రదించాల్సి ఉంటుంది.

మూడు వాహనాలతో సేవలు..



సాటి మనిషిని ఆదుకోవాలనే తపన, సేవా భావం లేకపోతే ఈ ప్రపంచం మరోలా ఉండేది. ఇతరుల కష్టాలను గురించి ఆలోచించే తత్వంతోనే మేము 1998లో పాతూరు చెరువుకట్ట షిరిడి సాయిబాబా మందిరం ద్వారా తొలి వైకుంఠ రథాన్ని ఏర్పాటు చేశాం. అప్పట్లో రాష్ట్రంలో మరెక్కడా ఇటువంటి సదుపాయం లేదు. అదో సాహసం. సాధ్యమవుతుందో కాదో తెలియని పరిస్థితి. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి కొనసాగిస్తున్నాం. మేము ఇప్పటికి మూడు వాహనాలను మార్చి ఎప్పటికప్పుడు కొత్త సేవలను అందుబాటులోకి తెచ్చాం. మా తర్వాత జయచంద్ర చౌదరి లాంటి వారితో సాయి మందిరాల సేవలు మరింత విస్తృతమయ్యాయి.

– పిన్ని నాగరత్నం, ఆర్యవైశ్య సంఘం, పాతూరు అధ్యక్షుడు

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం రూరల్: ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ స్వామి డిమాండ్ చేశారు. సోమవారం గిల్డ్ఆఫ్ సర్వీస్ స్కూల్ పక్కన ఉన్న ప్రభుత్వ వసతి గృహంలోఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణయ్య, కుల్లాయిస్వామి ఆధ్వర్యంలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలన్నారు. శిథిలావస్థకు చేరుకున్న వసతి గృహాల స్థానాల్లో నూతన భవనాలు నిర్మించాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. విద్యకు కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్ 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు హనుమంతు, రాధాజ్యోతి, మంజునాథ్, ఉమాహేశ్వర్, వంశీ, ఆనంద్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులతో విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్

అనంతపురం టౌన్: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ అన్నారు. ఇటీవల నంద్యాల జిల్లా సున్నిపెంటలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి విద్యుత్ ఉద్యోగుల క్రీడా పోటీల్లో బాల్‌బ్యాడ్మింటన్‌లో ప్రతిభ చాటి విజేత ట్రోఫీ దక్కించుకున్న జిల్లా క్రీడాకారులను సోమవారం సాయంత్రం తన కార్యాలయంలో ఆయన అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాకు మంచి పేరు తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏఓ బాలాజీ, ఏడీ శ్రీనివాసులు, మేనేజర్ వెంకటనారాయణ, జట్టు కెప్టెన్ ప్రభాకర్, స్పోర్ట్స్ కమిటీ నాగార్జున, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

'ముస్లింల మనోభావాలు దెబ్బతీసే చట్టాలొద్దు'



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: ముస్లింలను శత్రువులుగా చూస్తున్న బీజేపీ ప్రతిసారి మనోభావాలను దెబ్బతీసేలా చట్టాలను తీసుకొస్తుండటం సహేతుకం కాదని మేయర్ వసీం అన్నారు. సోమవారం స్థానిక ఆజాద్ ఫంక్షన్ హాలు వేదికగా వక్ఫ్‌బోర్డు–2024 చట్టానికి వ్యతిరేకంగా రాష్ట్ర ముతవల్లీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అఖిల పక్ష చర్చా వేదిక జరిగింది. రాష్ట్ర ముతవల్లీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు షకీల్ షఫీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి చట్టాలను తీవ్రంగా వ్యతిరేకించి ముస్లింలకు అండగా నిలబడ్డారన్నారు. అయితే కూటమిలో భాగస్వామి అయిన టీడీపీ, సీఎం చంద్రబాబు నాయుడు బేషరతుగా మద్దతు ఇచ్చి ముస్లింల మనోగతాన్ని పట్టించుకోలేదని దుయ్యబట్టారు. వక్ఫ్‌బోర్డు చట్టాలు వెనక్కు తీసుకునే వరకూ పోరాటం సాగించాలని తీర్మానించారు. జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజీఘర్ రిజ్వాన్ మాట్లాడుతూ.. చట్టాలు అమలు కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ముస్లింపై ఉందన్నారు. జేపీసీలో మంత్రివర్గ తీర్మానాన్ని పెట్టినప్పుడే బీజేపీ నైతికంగా ఓడిపోయిందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు షకీల్‌షఫీ, కేఎం షఫీవుల్లా మాట్లాడుతూ.. బీజేపీ తీసుకువస్తున్న చట్టాలు ముస్లింలకు ఎలా ఉపయోగపడతాయో వివరించాలని ప్రశ్నించారు. వక్ఫ్ విషయంలో అన్యమతస్థులకు అధికారం కట్టబెట్టే ప్రభుత్వం అదేవిధంగా హిందూ ఆలయాల్లో ముస్లింలకు అవకాశం కల్పిస్తుందా అని మండిపడ్డారు. సీపీఐ వలీ, కాంగ్రెస్ నుంచి దాదా గాంధీ, పెనుగొండ పీఠాధిపతి తాజ్‌బాబా, మాజీ మునిసిపల్ చైర్మన్ నూర్ మహ్మద్ తదితరులు మాట్లాడారు. బీజేపీ ముస్లింలను అణగదొక్కే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, కార్పొరేటర్లు ఇషాక్, షంషుద్దీన్, ఐఎంఎం మహబూబ్ బాషా, ఎంఎండీ ఇమామ్ పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

- 16 తులాల బంగారం, వెండి స్వాధీనం

బత్తలపల్లి: తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి, 16 తులాల బంగారం, వెండిని స్వాధీనం చేసుకున్నట్లు బత్తలపల్లి ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను ఆయన వెల్లడించారు. ఈ నెల 3న అనంతసాగరం గ్రామంలోని కురుబ కొండమ్మ ఇంట్లో చోరీ జరిగింది. ఘటనపై డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావు నేతృత్వంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పక్కా ఆధారాలతో అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లికి చెందిన ఆది శ్రీనివాసులును సోమవారం అరెస్ట్ చేశారు. ఉమ్మడి జిల్లాలో 37 కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు గుర్తించారు. నార్పల మండలం బొందలవాడలోనూ తాళం వేసిన ఇంట్లో చోరీ చేసినట్లు ఒప్పుకోవడంతో నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

వైద్యులపై దాడులు దుర్మార్గం



మాట్లాడుతున్న ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామస్వామి నాయక్

అనంతపురం మెడికల్: దేశ వ్యాప్తంగా వైద్యులపై దాడులు, హత్యయత్నాలు అధికమవుతున్నాయి. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తీసుకురావాలని ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామస్వామి నాయక్ పేర్కొన్నారు. ఈనెల 9న కలకత్తాలోని ఆర్‌జీకే వైద్య కళాశాలలో ఓ పీజీ విద్యార్థిని దారుణ హత్యకు గురికావడం బాధాకరమన్నారు. దేశ వ్యాప్తంగా వైద్యులు చేపడుతున్న నిరసన కార్యక్రమాలకు ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం మద్దతు తెలిపింది. గతంలో తెలంగాణా, పూనె, ముంబాయి, ఇప్పుడు కలకత్తాలో వైద్యులపై హత్యాయత్నాలు జరిగాయన్నారు. వైద్యులకు సరైన భద్రత లేకపోవడం కారణంగానే దారుణాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. భవిష్యత్తులో ఇటువంటి దాడులు జరగకుండా కేంద్రం పార్లమెంట్‌లో కఠినమైన చట్టాలు తీసుకురావాలన్నారు. ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. వైద్య విద్యార్థులు గుర్తు తెలియని వ్యక్తులకు దూరంగా ఉండాలన్నారు. స్వీయ రక్షణ కోసం కరాటే, తైక్వాండో తదితర యుద్ధ కళలు నేర్చుకోవాలన్నారు. అనంతరం ఏపీజీడీఏ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి సర్వజనాస్పత్రి వరకు ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, వైద్యులు డాక్టర్ రమాబాయి, పెథాలజిస్టు డాక్టర్ భవాని, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, పీజీ విద్యార్థులు, మెడికోలు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా రాకపోకలు



ఆర్టీసీ బస్టాండ్ ఔట్ గేటు వద్ద డ్రైవర్‌తో గొడవ పడుతున్న కారు యజమాని

అనంతపురం క్రైం: ఆర్టీసీ బస్టాండ్‌లోకి ప్రైవేటు వాహనాలు ఇష్టారాజ్యంగా వస్తున్నాయి. దీంతో డ్రైవర్లు బస్సును నడిపేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన ద్వారాల వద్ద ఈ సమస్య తీవ్రంగా ఉంది. కార్లు, మోటారు సైకిళ్లు ఎటుపడితే అటు వస్తుండటంతో చిన్నచిన్న ప్రమాదాలకు దారి తీస్తోంది. ఎక్కువగా ఔట్ గేటు వద్ద వాహనాలు ఎదురుగా బస్టాండ్ ఆవరణలోకి వస్తుండటంతో ఈ సమస్య తీవ్రంగా మారింది. ఓ వైపు ప్రధాన రహదారిపై వాహనాల రద్దీ ఉండటంతో డ్రైవర్లు బస్సును రోడ్డుపైకి తెచ్చేందుకు నరకం చూస్తున్నారు. ఆర్టీసీ అధికారులు డిపో కంట్రోలర్ ఆధ్వర్యంలో ఇన్, ఔట్ గేటు వద్ద వ్యక్తులను ఏర్పాటు చేసి లోపలికి అనుమతించకుండా చర్యలు తీసుకుంటే సమస్యకు పరిష్కారం చూపినటు అవుతుందని డ్రైవర్లు వాపోతున్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై కారు యజమాని చిందులు..

ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ ఔట్ గేటు ద్వారా ఓ కుటుంబం కారులో వచ్చింది. బస్సు కట్ చేసేందుకు అవకాశం లేనంతగా ట్రాఫిక్ ఉండటంతో బస్సు వెనుక బాగం కారుకు తగిలింది. దీంతో కారుకు చిన్నపాటి గీతలు పడ్డాయి. అంతే కారు యజమాని ఆర్టీసీ డ్రైవరుపై చిందులేశాడు. మహిళలు అయితే ఏకంగా డ్రైవర్‌పై దాడి చేసేంత పని చేశారు. ఇది రాంగ్ రూట్.. ఇలా రాకూడదని చెప్పే నాథుడు లేక పోవడంతో డ్రైవర్ వారి చేతి తిట్టించుకుని క్షమాపణ చెప్పాల్సి వచ్చింది. ఓ వైపు పోలీసులు ఉన్నప్పటికీ కారు యజమాని బస్సు పోనివ్వకుండా ఆపేశాడు. చేసేది లేక త్రీటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చి ప్రయాణికులు ఇబ్బంది పడతారని చెప్పి బస్సు డ్రైవర్ వెళ్లిపోయాడు. ఆర్టీసీ అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

భగవద్గీతపై ప్రచారం

అనంతపురం కల్చరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టతను అందరూ తెలుసుకోవాలని త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞానవేదిక అధ్యక్షుడు మల్లికార్జున అన్నారు. సోమవారం ఇందూ జ్ఞానవేదిక సభ్యులు నగరం నుంచి ఇస్కాన్ మందిర పరిసరాల వరకు భగవద్గీతపై ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో భగవద్గీత, త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల పరిచయం కోసం అన్ని చోట్ల సేవా భావంతో ప్రచారం చేస్తున్నామన్నారు. సకల సమస్యల పరిష్కారమార్గమైన భగవద్గీత నిత్య పఠన గ్రంథమని.. అందరితో చదివించాలని కోరారు. కార్యక్రమంలో జ్ఞాన వేదిక సభ్యులు పక్కీరప్ప, జాహ్నవి, నీలావతి, మోహనమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ

అనంతపురం ఎడ్యుకేషన్: జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో అనంతపురంలోని అశోక్ నగర్‌లో ఉన్న సరస్వతి విద్యామందిరం 2వ తరగతి విద్యార్థి హత్వికారెడ్డి ప్రతిభ చాటింది. ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు తమిళనాడులో జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలు జరిగాయి. పోటీల్లో రజత పతకం సాధించిన హత్వికారెడ్డిని ఎన్టీఆర్ రోలింగ్ స్కేటింగ్ అకాడమీ కోచ్ ఆంజనేయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామాల అభివృద్ధి కోసమే శిక్షణ తరగతులు



ఆత్మకూరు: మాట్లాడుతున్న పంచాయతీ సెక్రటరీ ఖాదర్‌వలి

రాప్తాడు: గ్రామాల అభివృద్ధి కోసమే సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ సాల్మన్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీరు, పారిశుధ్యాన్ని మెరుగుపరచడం, వీధి దీపాల నిర్వహణ, గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారీ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నరసింహా రెడ్డి, రిసోర్స్ పర్సన్‌లు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ప్రతి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిద్దాం. పంచాయతీల అభివృద్ధికి అందరూ పాటుపడాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివశంకర్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, మండల స్థాయి అధికారులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీధి దీపాల నిర్వహణ, గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారీ తదితర అంశాలపై ట్రైనర్స్ వివరించారు. ఈ గ్రామ్ స్వరాజ్‌లో భాగంగా 15వ వార్షిక నిధులు ఎలా వస్తాయి? వాటిని ఏ విధంగా వినియోగించాలన్న విషయాలపై చర్చించారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

అనంతపురం అగ్రికల్చర్: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలంటూ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) కార్యాలయంలో సోమవారం ప్రతిజ్ఞ చేశారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల జరుగుతున్న అనర్థాలు, కుటుంబ కలహాలు, యువత చెడిపోతున్న వైనాన్ని గుర్తు చేశారు. డ్రగ్స్ ఫ్రీ ఇండియా క్యాంపెయిన్‌లో యువత భాగస్వాములు కావాలన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా డ్రగ్స్ రహిత జిల్లా కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో కె.సురేఖారాణి, జిల్లా సహకార అధికారి (డీసీఓ) అరుణకుమారి, నాబార్డు డీడీఎం అనురాధ మహిళా ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాప్తాడు: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న పేర్కొన్నారు. సోమవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలతో అనర్థాలు చోటుచేసుకుంటాయని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసై ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడతే జీవితాలు నాశనం కావడంతో పాటు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని తెలిపారు. మాదక ద్రవ్యాలపై గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.

రుణాలు చెల్లించండి

అనంతపురం రూరల్: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకాల కింద రుణాలు పొందిన లబ్దిదారులు సకాలంలో చెల్లించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. లబ్ధిదారులు తప్పనిసరిగా వాయిదాలను సక్రమంగా చెల్లించాలన్నారు.

పాతూరులో కూలిన చెట్టు



కారు అద్దాలు పగిలిన దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: పాతూరులో గత అర్ధరాత్రి గాలీవానకు ఓ భారీ వృక్షం నేలకొరిగింది. చెట్టు కింద ఉన్న కారు పూర్తిగా ధ్వంసమైంది. కాగా మరో మూడు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి.



ఎంఈఓలకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

జీఓ 117 రద్దు చేయాలి

ఆత్మకూరు: ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను చేపట్టడం సరికాదని ఏపీటీఎఫ్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీఓ 117 రద్దు చేస్తామని విద్యాశాఖ మంత్రి లోకేష్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఆ జీఓను రద్దు చేయకుండా ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను చేపట్టడం వల్ల విధులను బాయికాట్ చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా విద్యార్థుల సంఖ్య తగ్గిస్తూ అవసరమైన చోట విద్యా వలంటీర్లను తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ సాంస్కృతిక శాఖ కన్వీనర్ గురురాజ్, ప్రెసిడెంట్ శ్రీనివాసులు, జనరల్ సెక్రటరీ మదన్, నాయకులు రామాంజనేయులు, రవి, నిర్మల, శిరీష పాల్గొన్నారు.

ఏకపక్ష నిర్ణయాలతో గందరగోళం

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యా రంగంలో కొత్త ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలతో గందరగోళం సృష్టిస్తోందని గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకులు మండిపడ్డారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుజ్జల శివయ్య, డెగావత్ రవీంద్రనాథ్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జీఓ 117 రద్దు చేసి ఉపాధ్యాయుల సర్దుబాటు చేయమని ఉపాధ్యాయ సంఘాలు మొరపెట్టుకుంటున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. సర్దుబాటు నుంచి వికలాంగ, వితంతువులు, స్పౌజ్, అవివాహిత మహిళలను మినహాయించాలని.. వారిని సర్ ప్లస్‌గా చూపించకూడదనే నిబంధనలు ఆచరణలో ఉంచలేదన్నారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి తర్వాత ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాల్సిందన్నారు. అలా కాకుండా ఏకపక్ష నిర్ణయాలతో ఉపాధ్యాయులకు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. అనాలోచిత నిర్ణయాలకు ఉపాధ్యాయులు బలి చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. మిగులు ఉపాధ్యాయులను అదే మండలంలోని ఉంచకుండా కొత్త నిర్ణయాలతో అందరినీ ఇబ్బందికి గురి చేయడం మంచి పద్ధతి కాదన్నారు.